
నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 17 డిసెంబర్ 2024 HYDERABAD

## గ్రేటర్ గజ గజ

### రికార్డు స్థాయిలో పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోతుండడంతో చలి పులి నగరాన్ని గజ గజ వణికిస్తోంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 29.3 డిగ్రీలు నమోదవ్వగా, రాజేంద్ర నగర్‌లో కనిష్ఠం ఉష్ణోగ్రతలు అత్యల్పంగా 8.5 డిగ్రీలు, నగరంలో 11.4 డిగ్రీలు, హకీంపేటలో 11.6 డిగ్రీలు, దుండిగల్‌లో 11.9 డిగ్రీలు, గాలిలో తేమ 33 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోతుండడంతో రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నట్లు అధికారులు వెల్లడించారు.

## పనుల్లో నాణ్యత తప్పనిసరి

### జలమండలిలో బీఐఎస్ అవగాహన కార్యక్రమం

సిటీబ్యూరో: జలమండలి చేపట్టే పనుల్లో నాణ్యతను పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జలమండలి అధికారులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అవగాహన కార్యక్రమం నిర్వహించింది. సోమవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి క్షేత్ర స్థాయి ఇంజినీర్ల నుంచి జలమండలి ఉన్నతాధికారుల వరకు హాజరయ్యారు. జలమండలి సేవలు, పనుల్లో నాణ్యతను మెరుగుపర్చేందుకు ఈ అవగాహన కార్యక్రమం దోహదపడుతుందని ఎండీ అశోక్ రెడ్డి పేర్కొన్నారు. జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో చేసిన డీ సిల్టింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్ లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌పై ఈడీ సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు 14 వేల ప్రాంతాల్లో 1,758 కిలోమీటర్ల మేర సీవరేజీ పైపులైన్‌కు డీ సిల్టింగ్ పనులు నిర్వహించినట్లు ఈడీ తెలిపారు. లక్షా 40వేల మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసినట్లు వెల్లడించారు.



తాబేలు.. భలే బాగు.. జంక్షన్ల సుందరీకరణలో భాగంగా నాగార్జున సర్కిల్-కేబీఆర్ పార్క్ రోడ్‌లో ఏర్పాటు చేసిన తాబేలు ఆకృతి

## దవాఖానల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 16: ప్రభుత్వ దవాఖానలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో మల్కాజిగిరి నియోజక వర్గంలోని ప్రభుత్వ దవాఖానలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ.. ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహకు ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరిలోని ప్రభుత్వ దవాఖానల్లో అదనంగా ఆపరేషన్ థియేటర్లు, డయగ్నోస్టిక్ ల్యాబ్, బ్లడ్ బ్యాంక్, 5 పడకల డయాలసిస్ యూనిట్, ట్రౌమా కేర్ యూనిట్, సీటీ స్కాన్ సదుపాయాలు ప్రభుత్వం కల్పించాలన్నారు. నీటి సదుపాయం కోసం పవర్ బోర్ వెల్‌ను ఏర్పాటు చేయడంతో పాటు లిఫ్ట్ తరచూ పాడవుతున్నదన్నారు. లిఫ్ట్ తరచూ పనిచేయక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, రోగుల అటెండర్ల కోసం బాత్రూంను ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్లు మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.



మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

# హైడ్రా తెచ్చిన తంటా..!

## జూపార్కు ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంపై రాజకీయ రంగు

- ఇప్పటికే నాలుగు పర్యాయాలు వాయిదా
- ఎంఐఎం, కాంగ్రెస్ మధ్య గ్యాప్ కారణమని ప్రచారం
- ఎంపీ అసదుద్దీన్ అందుబాటులో లేకనే పోస్ట్‌పోన్ చేస్తున్నారన్న వాదన
- ప్రభుత్వ తీరుపై జీహెచ్‌ఎంసీలో ఆసక్తికర చర్చ

సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి రావాల్సిన జూపార్కు -అరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంపై రాజకీయ రంగు అలుముకున్నది. అధికార పార్టీ కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య నెలకొన్న గ్యాప్‌తో ఈ ఫ్లై ఓవర్ వాహనదారులకు అందుబాటులోకి రావడం లేదన్న చర్చ అటు జీహెచ్‌ఎంసీ అధికార వర్గాలు, ఇటు పాలక మండల సభ్యుల్లో చర్చ ఆసక్తికర చర్చ జరుగుతున్నది. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్‌ఆర్‌డీపీ)లో భాగంగా రూ. 629.30 కోట్లతో ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు ఆరు లేన్లతో119 పిల్లర్లతో 4.08 కిలోమీటర్ల మేర చేపట్టిన భారీ ఫ్లై ఓవర్ నిర్మాణం పనులు పూర్తి చేసుకోగా, ప్రారంభం విషయంలో తరచూ వాయిదాల పర్వాన్ని కొనసాగిస్తుండడమే ఇందుకు నిదర్శనమని చెప్పొచ్చు. వాస్తవంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన-ప్రజా విజయోత్సవ సంబరాల్లో పురపాలకకు సంబంధించిన ఈ నెల 3న పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరపాలని నిర్ణయించి కొన్నింటిని ప్రారంభించారు. అయితే షెడ్యూల్ ప్రకారం వర్చువల్ విధానంలో జూపార్కు-అరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభం ఉందని, ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. కానీ ఆ రోజు కుదరలేదని చెబుతూ వాయిదా వేశారు. ఆ తర్వాత 5వ తేదీ, 8వ తేదీ అంటూ వాయిదా వేస్తూ వచ్చారు. చివరకు 9న ఫ్లై ఓవర్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేస్తామని సర్కారు ప్రకటించింది. కానీ నాలుగు దఫాలుగా వాయిదా వేస్తూ వచ్చిన అధికారులు ఇప్పటి వరకు ఈ ఫ్లై ఓవర్ ఎప్పుడు ప్రారంభిస్తారో వెల్లడించలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారు. సీఎంవో ఆదేశాలు వస్తేనే ఈ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవం ఉంటుందని సంబంధిత ఇంజినీర్లు చెబుతుండడం గమనార్హం.



### ఎంఐఎం, కాంగ్రెస్ మధ్య గ్యాప్ కారణం?

కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల ప్రజాప్రతినిధుల మధ్య అభిప్రాయభేదాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన హైడ్రా తీరు ఇందుకు ఆజ్యం పోసినట్లు పాలకమండలి సభ్యుల్లో చర్చ జరుగుతున్నది. ఉద్ధాలా చెరువు సమీపంలో ఎంఐఎం పార్టీ నేతలకు సంబంధించిన భవనాలను కూల్చివేయడం, సల్కం చెరువులోని నిర్మాణాలు, ఎంపీ అసదుద్దీన్‌కు సంబంధించిన విద్యా సంస్థలపై హైడ్రా వ్యవహరించిన తీరుపై అసదుద్దీన్ గుర్రుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, సీఎం రేవంత్‌రెడ్డిల మధ్య దూరం పెరిగిందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. హైడ్రా ఏర్పాటుపై జీహెచ్‌ఎంసీ పాలకమండలిలో ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు మేయర్‌ను కలిసి వ్యతిరేకిస్తూ పలు దఫాలుగా వినతిపత్రాలు సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఇటీవల చాదర్‌ఘట్ సమీపంలోని చికెన్ మార్కెట్ వ్యవహారంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వర్సెస్ ఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ బేగ్ మధ్య తారాస్థాయిలో విభేదాలు చోటు చేసుకున్నాయి. ఈ వరుస సంఘటనల నేపథ్యంలోనే ఆరాంఘర్-జూపార్కు ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంపై తీవ్ర ప్రభావం పడుతుందన్న చర్చ జరుగుతున్నది. ప్రొటోకాల్ ప్రకారం ఎంపీ అసదుద్దీన్ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుంది. అయితే జీహెచ్‌ఎంసీ అధికారుల ఆహ్వానానికి అట్నుంచి సరైన సమాధానం రాకపోవడం, ఇదే విషయాన్ని ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. మొత్తంగా కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య గ్యాప్ పెరగడం, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహారంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక పార్టీ కోసం ప్రారంభోత్సవాన్ని ఇంకా ఎన్ని సార్లు వాయిదా వేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు.

### పాతనగరానికి ఉపశమనం




ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన సిగ్నల్ రహిత, మెరుగైన రవాణా వ్యవస్థను పటిష్టం చేయడానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ (ఎస్‌ఆర్‌డీ) కార్యక్రమం ద్వారా విడతల వారీగా ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తున్నాయి. బైరామల్‌గూడ ఫ్లై ఓవర్లు, లూప్‌లను ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం జూపార్కు-అరాంఘర్ ఫ్లై ఓవర్ విషయంలో తాత్సారం చేస్తూ వస్తుండడం చర్చనీయాంశంగా మారింది. పాతనగరంలో ఇప్పటికే పలు ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వచ్చి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. ఓవైసీ ఫ్లై ఓవర్, అబ్దుల్ కలాం ఫ్లై ఓవర్, చాంద్రాయణ గుట్ట ఫ్లై ఓవర్ అందుబాటులోకి తీసుకురాగా..ఆరాంఘర్-జూపార్కు ఫ్లై ఓవర్‌తో శంషాబాద్ విమానాశ్రయం వరకు ప్రయాణం సాఫీగా సాగనున్నది. నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు రవాణా మెరుగుపరచడమే కాకుండా సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థకు దోహద పడనున్నది. వీలైనంత త్వరగా ఈ ఫ్లై ఓవర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

## బల్దియా వెబ్‌సైట్ తప్పుల తడక

### అప్‌డేట్ చేయని ఐటీ విభాగం

### కొందరు బదిలీపై వెళ్లినా.. ఇంకా వారి పేర్లే దర్శనం

సిటీబ్యూరో: తెలంగాణ స్టేట్ పోర్టల్ వెబ్‌సైట్ తప్పుల తడకగా ఉంది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) పరిధిలోని జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న ఉన్నతాధికారుల పేర్లను గల్లంతు చేశారు. రెండేండ్ల కిందట బదిలీ అయిన సీనియర్ ఐపీఎస్ విశ్వజిత్ కంపాటి ఇంకా బల్దియాలోనే పనిచేస్తున్నారు. అయితే ఇంకా అడ్వర్టైజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్టు అడిషనల్ కమిషనర్‌గా విశ్వజిత్ కంపాటి పేరు కనిపిస్తుండటం గమనార్హం. ఇదే వరుసలో పలువురు ఐఏఎస్‌లు, ఉన్నతాధికారులు జీహెచ్‌ఎంసీలోనే కొనసాగిస్తున్నట్లు చూపారు. నాగర్ కర్నూల్‌లో కలెక్టర్‌గా పనిచేస్తున్న ఐఏఎస్ సంతోష్ బదావత్ వెబ్‌సైట్‌లో ఇంకా జీహెచ్‌ఎంసీ అడిషనల్ హెల్త్‌గానే ఉంది. ప్రియాంక ఆల, శృతి ఓజాలు బదిలీ అయి సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా వారి పేర్లే దర్శనమిస్తున్నాయి. చార్మినార్ జోనల్ కమిషనర్‌గా రెండు సంవత్సరాల నుంచి పనిచేస్తున్న వెంకన్న స్థానంలో ఇంకా అశోక్ సామ్రాట్ పేరే ఉంది. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌గా రవికిరణ్ ఉండగా, బి. శ్రీనివాస్‌రెడ్డినే కొనసాగించారు. రిటైర్డ్ అయిన తర్వాత కూడా నాలుగేండ్ల పాటు పనిచేసి వెళ్లిపోయిన జయరాజ్ కెన్నెడి పేరు ఇంకా తొలగించలేదు. కొత్తగా వచ్చిన అధికారుల పేర్లు అప్‌డేట్ కాలేదు అనుకుంటే పొరపాటే..జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి, హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్, అలాగే జోనల్ కమిషనర్లు వచ్చినా ఐఏఎస్‌ల పేర్లు మార్చినప్పటికీ మిగతావి మాత్రమే అలాగే ఉంచడం ఐటీ అధికారుల పనితీరుకు నిదర్శనం. లక్షల జీతాలు తీసుకుంటూ కనీసం వెబ్‌సైట్‌ను కూడా సరిగా అప్‌డేట్ చేయని పరిస్థితి ఐటీ విభాగంలో నెలకొనడం పట్ల తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియా ద్వారా తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తున్న తరుణంలో ఇలా తప్పుడు సమాచారం వెబ్‌సైట్‌లలో ఉంచడం సర్కారు పనితీరుకు అద్దం పడుతున్నది.



## శిల్పా లే అవుట్ సెకండ్ లెవల్ ఫ్లైఓవర్

# త్వరగా పూర్తి చేయాలి

### మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం

### క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించిన కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : శిల్పా లే అవుట్ సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం గచ్చిబౌలి నుంచి కొండాపూర్‌కు వెళ్లే శిల్పా లే అవుట్ సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. సర్వీస్ రోడ్డుకు సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. భూసేకరణలో ప్రభుత్వ పాఠశాల భవనం కొంత మేరకు కోల్పోతున్నందున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఎస్‌ఆర్ పద్ధతిలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కమిషనర్ ఆదేశించారు. విద్యార్థులు రోడ్డుకు ఇరువైపులా దాటి వెళ్లిన సందర్భంలో ప్రమాదం సంభవించకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు నిర్దేశించిన కాల వ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగి.. సకాలంలో గమ్యానికి చేరే వెసులుబాటు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ నగరవాసులకు మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సీఈ దేవానంద్, ఎస్ఈ శంకర్ నాయక్, డీసీ ముకుందా రెడ్డి, ఈఈ హరీశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే..

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా నాలుగు విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించినట్లు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 43 విన్నపాలు రాగా, అందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 19, ఇంజినీరింగ్ 9, ఎఫ్ఏ సెక్షన్ నాలుగు, ఎలక్ట్రికల్ , అర్బన్ బయోడైవర్సిటీ రెండు చొప్పున, ట్యాక్స్, అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్, స్పోర్ట్స్, ఎస్టేట్, హెల్త్, లేక్స్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక ఆరు జోన్లలో మొత్తం 99 అర్జీలను స్వీకరించగా, కూకట్‌పల్లిలో 53, సికింద్రాబాద్‌లో 20, శేరిలింగంపల్లిలో 12, చార్మినార్‌లో 8, ఎల్బీనగర్‌లో 6 విన్నపాలు స్వీకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, సుభద్ర దేవి, నళిని పద్మావతి, పంకజ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ ఇలంబర్తి



## లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి డిమాండ్
- నిరంకుశ పాలనను నిరసిస్తూ.. ప్రజలంతా అన్నదాతలకు మద్దతు తెలుపాలని పిలుపు
- నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాల సమర్పణ

బడంగ్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా థర్డ్ డిగ్రీ ఉపయోగించి.. జైలులో పెట్టడాన్ని నిరసిస్తూ.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు.. మహేశ్వరం నియోజకవర్గవ్యాప్తంగా మంగళవారం ఉదయం 11 గంటలకు అన్ని అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి వినతిపత్రాలు సమర్పించాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. రైతుల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. నిరంకుశ పాలనను నిరసిస్తూ.. ప్రజలంతా అన్నదాతలకు మద్దతు తెలుపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అమానవీయ, అణచివేత ధోరణిని నిరసిస్తూ.. ప్రజలు రైతులకు మద్దతు తెలుపాలన్నారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి.. జైలులో నిర్బంధించిన రైతులను విడుదల చేసే వరకు పోరాటం చేయాలన్నారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు చేపట్టే ఉద్యమంలో ప్రజాస్వామికవాదులు, వివిధ సంఘాలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, కవులు, కళాకారులు, రచయితలు అందరూ భాగస్వాములు కావాలన్నారు. రైతు లేనిది రాజ్యం లేదన్నారు. రైతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

## స్థానికులందరినీ ఏకం చేస్తాం

- నార్త్ సిటీ మెట్రో సాధనకు సమితి మరో అడుగు
- మేడ్చల్ మెట్రో సాధనలో క్రియాశీలక ప్రణాళికలు
- వినూత్న కార్యక్రమాలకు కార్యాచరణ

సిటీబ్యూరో: నార్త్ సిటీ మెట్రో సాధనలో మేడ్చల్ మెట్రో సాధన సమితి కీలక నిర్ణయం తీసుకున్నది. నార్త్ సిటీకి మెట్రో నిర్మాణమే లక్ష్యంగా స్థానిక కమ్యూనిటీలను భాగస్వామ్యం చేసేలా కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా మేడ్చల్ సాధన సమితి ఆధ్వర్యంలో... స్థానికంగా ఉండే కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లను కలుపుకొని ఉద్యమ కార్యాచరణ వైపు అడుగులు వేస్తున్నది. ప్రస్తుతం ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన రాలేదు. దీంతో పాటు సెకండ్ ఫేస్-2లోనూ నార్త్ సిటీలోని ప్రతిపాదిత ప్రాంతాలను చేర్చలేదు. ఇలా తమ ప్రాంతానికి మెట్రో అంశంలో సీఎం రేవంత్‌రెడ్డి మొండిచేయి చూపుతున్నారు. ఒకసారి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే.. భవిష్యత్‌లో మెట్రో ప్రాజెక్టు నిర్మాణం అసాధ్యమని స్థానికులు భావిస్తున్నారు. దీనికోసం స్థానికులను భాగస్వామ్యం చేస్తూ మేడ్చల్ మెట్రో సాధన సమితి డిజిటల్ మాధ్యమాలు, స్థానికంగా కమ్యూనిటీలను ఏర్పాటు చేసుకుంటూ ఆ ప్రాంతానికి మెట్రో ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తోంది.

### వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం..

మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో నిర్మాణమే లక్ష్యంగా మేడ్చల్ మెట్రో సాధన సమితి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నది. నార్త్‌సిటికీ మెట్రో సాధన ప్రాముఖ్యతను వివరిస్తూ ఇప్పటికే పలు కార్యక్రమాలు, నిరసనలు, ఆందోళనలను చేపట్టింది. తాజాగా మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో కాలనీకొక కమ్యూనిటీని ఏర్పాటు చేస్తోంది. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు ఉన్న కాలనీ వాసులను కలుపుకొంటున్నది. కమ్యూనిటీ బిల్డప్ పేరిట ఇంటింటికీ నార్త్ సిటీ మెట్రో ఉద్యమాన్ని తీసుకెళ్లడంలో భాగమని మెట్రో సాధన సమితి నిర్వాహకులు చెబుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి ఎంపీగా రేవంత్‌రెడ్డి గెలిచిన తర్వాత... ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పునర్జీవం పోసిన నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సౌకర్యాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తానన్నారు. కానీ సీఎం అయ్యాక ఈ ప్రాంతానికి అత్యంత అవసరమైన మెట్రో నిర్మాణంలో మొండి చేయి చూపారు. ఫేస్-2లో భాగంగా నగరంలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో లైన్లను నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధం చేసింది. కానీ ఎన్నో ఏండ్లుగా పోరాడుతున్నా స్థానికుల ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోకుండానే అలైన్‌మెంట్లను ప్రకటించింది. ఇందులో నార్త్ సిటీని పరిగణనలోకి తీసుకోలేదు. కేవలం రైట్ ఆఫ్ వే లేదనే సాకుతో మేడ్చల్ ప్రాంతానికి మెట్రోను దూరం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని స్థానికులు వాపోతున్నారు.

